


గ్రేటర్ విశాఖలో ఇప్పటికీ చక్కని పల్లెటూరి వాతావరణాన్ని చూడాలంటే అడవివరానికి సమీపంలోని విజినిగిరిపాలెం వెళ్లాల్సిందే. ఇక్కడి పొలాలు వరి, కూరగాయలు, పువ్వుల సాగుతో పచ్చపచ్చగా కళ్లముందు కదలాడతాయి. పంచగ్రామాల భూసమస్య కారణంగా.. మిగిలిన ప్రాంత రైతులకు దక్కే రాయితీలు, రుణాలు తదితర ఏ ప్రయోజనాలూ ఇక్కడి రైతులకు అందట్లేదు. సాగులో సలహాలు, సూచనలిచ్చే వ్యవసాయాధికారులు కూడా తమను పట్టించుకోవట్లేదని రైతులు వాపోతున్నారు.

కూరగాయల సాగుకు మోటారు ద్వారా నీటి తడి పెడుతున్న రైతు

ఇలాంటి దిగుడు బావులే కాస్త ఆసరా..

సాగుసాయం లేక..

రైతుల వెతలు

- వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న విజినిగిరిపాలెం రైతులు
- పంచగ్రామాల భూసమస్యతో సబ్సిడీలు, రుణాలకు నోచుకోని వైనం
- ఇప్పటికీ 100 మంది రైతులు.. 500 ఎకరాల్లో సాగు

సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డు పరిధి అడవివరానికి సమీపంలో ఉన్న విజినిగిరిపాలెం పూర్తిగా వ్యవసాయాధార గ్రామం. తరతరాలుగా రైతులు వ్యవసాయాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. నేటికీ 100 మంది రైతులు 500 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. సుమారు 400 ఎకరాల్లో వరి పండిస్తుండగా, మిగిలిన మెట్ట పొలాల్లో పలు రకాల కూరగాయలు, పువ్వులు సాగుచేస్తున్నారు. పండిన కూరగాయలను అడవివరం, శ్రీనివాసనగర్, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంతలకు నేరుగా తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ధాన్యాన్ని తమ అవసరానికి సరిపడా నిల్వచేసుకుని మిగిలింది విక్రయిస్తుంటారు.



కూరగాయలు పండించేందుకు మడులను సిద్ధం చేస్తున్న రైతు

వరుణదేవుడిపైనే అధిక భారం

విజినిగిరిపాలెం రైతులు ఎక్కువగా వర్షాధారంగానే పంటలు పండిస్తుంటారు. వర్షాలు బాగా కురిస్తే సమీపంలోని రామన్న చెరువు నిండుతుంది. అక్కడి నుంచి నీటిని కాల్వల ద్వారా తమ పొలాలకు మళ్లించి, పంటలు పండిస్తుంటారు. వర్షం నీరు పుష్కలంగా ఉంటే రబీ, ఖరీఫ్ అని తేడా లేకుండా రెండుసార్లు వరి పండించిన సందర్భాలూ ఉన్నాయి.

నేలబావుల్లోని నీటిని మెటార్ల ద్వారా పొలాలకు పంపించినా సరిపోని పరిస్థితి. పూర్తిగా వర్షాలు పడని రోజుల్లో బావులు ఎండిపోయి, అసలు పంటలు పండించని పరిస్థితి కూడా ఉంది.



ఏపుగా ఎదిగిన వంగతోట

భూసమస్యతో సబ్సిడీలకు దూరం

ఒక్కప్పుడు ఇబ్బందుల్లేకుండా సాగిన సేద్యం 1996 నుంచి ఏర్పడిన పంచగ్రామాల భూసమస్య కారణంగా జరగడం మొదలయింది. అంతకు ముందు రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులతోపాటు, బ్యాంకుల రుణాల ద్వారా వ్యవసాయ యంత్రాలు కూడా కొనుక్కునేవారు. వ్యవసాయ అధికారులు పలు సూచనలు, సలహాలు అందించేవారు. భూసమస్యతో రాయితీ, లోన్లు రాకుండాపోయాయి. అధికారులూ ఇటువేపు చూడటం మానేశారు. పెట్టుబడి వ్యయం పెరిగి, అప్పులపాలయ్యే పరిస్థితులు దాపురించాయి. భూసమస్య కొలిక్కి వచ్చి, ఎప్పుడు పూర్వ వైభవం చేకూరుతుందా అని ఎదురుచూస్తూ.. నమ్మకంతో రైతులు వ్యవసాయం చేస్తూనే ఉన్నారు.

అప్పట్లో లోన్లు వచ్చేవి



అప్పట్లో నీటిని తోడే మోటార్లు కొనుగోలు చేసుకునేందుకు బ్యాంకులు రుణాలు ఇచ్చేవి. మా కటుంబ సభ్యులు కూడా బ్యాంకుల్లో రుణాలు తీసుకుని గతంలో మోటార్లు కొనుగోలు చేశారు. ఇప్పుడు మాకా అవకాశం లేకుండా పోయింది. ఏం కావాలన్నా.. పూర్తి డబ్బులు చెల్లించాల్సిందే. దీంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, వ్యవసాయ పరికరాలు కొంటున్నాం. ఇప్పటికైనా మాకూ వ్యవసాయ రుణాలిచ్చి ఆదుకోవాలి.

– మజ్జి రాంబాబు

చెరువు నిండితేనే...



నేను ఎకరం పొలంలో కూరగాయలు, అర ఎకరంలో వరి పండిస్తుంటాను. వర్షాలు సమృద్ధిగా పడి విజినిగిరిపాలేనికి సమీపంలో ఉన్న రామన్న చెరువు నిండితేనే పంటలు బాగా పండుతాయి. లేదంటే ఇబ్బందే. గంటకి రూ.వెయ్యి చెల్లించి ట్రాక్టర్‌తో భూమిని దున్నుతాం. విత్తనాలు, ఎరువులు బయటే కొనుగోలు చేస్తాం. పంటలు బాగా పండి, చేతికొస్తేనే శ్రమకి తగ్గ ఫలితం వస్తుంది. లేదంటే శ్రమంతా వృథా అవక తప్పదు.

– మజ్జి సూర్యనారాయణ

రైతు భరోసా లేదు



నాకు ఉన్న 38 సెంట్ల భూమిలో వంకాయలు, బెండకాయలు, బీరకాయలు, ఇతర కూరగాయలు పండిస్తుంటాను. కొన్ని కొబ్బరి మొక్కలు వేశాను. దేవస్థానం భూసమస్య కారణంగా గత ప్రభుత్వం అందించిన రైతు భరోసా కూడా మాకు రాలేదు. విత్తనాలు, ఎరువుల రాయితీ లేకపోవడంతో, అధిక ధరలకు మార్కెట్లో కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. ఏ విత్తనాలు మంచివో...ఏ విత్తనాలు నకిలీవో చెప్పే దిక్కూ లేదు.

– పల్లి అప్పలరాజు

రెవెన్యూ సదస్సులో విన్నవించాం



దేవస్థానం భూసమస్య కారణంగా రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజినిగిరిపాలెం రైతుల కష్టాలను ఇటీవల అడవివరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో చినగదిలి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. దేవస్థానం భూసమస్యతో ఇక్కడి రైతులు పడుతున్న కష్టాలను స్వయంగా వివరించాం. ప్రభుత్వం మా పరిస్థితిని అర్థం చేసుకుని, మిగిలిన రైతుల మాదిరే ఇక్కడి రైతులకూ సబ్సిడీలు, లోన్లు పునరుద్ధరించాలి.

– విజినిగిరి చిన్నారావు

పీజీఆర్ఎస్‌కు 5 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. 93వ వార్డు నాయుడుతోట ప్రాంతంలో కసవయ్య అనే బిల్డర్ చెట్లను ఇష్టానుసారం నరికేశాడని, 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లో చెట్టు కొమ్మల వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, 98వ వార్డు కాలువలపై ప్రైవేటు వ్యక్తులు పలకలు వేయడం వలన పారిశుధ్య పనులకు ఆటంకం కలిగి దుర్గంధం వ్యాపిస్తోందని, 96వ వార్డు పెందుర్తి అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యుత్ దీపం ఏర్పాటు చేయాలని, 98వ వార్డు పద్మావతినగర్ ప్రాంతంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని జోనల్ కమిషనర్ కె.హేమావతికి ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులను స్వీకరించి వాటిపై విచారణ చేసి, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం



ఎన్నికైన ఏఐవైఎఫ్ నూతన కార్యవర్గం ప్రతినిధులు

పెందుర్తి: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వై.రాంబాబు, కార్యదర్శిగా కెంగువ అచ్యుత్, సహాయ కార్యదర్శిగా కొమర సందీప్, కోశాధికారిగా పి.శివ, ఉపాధ్యక్షుడు ఉల్లం నాగరాజు, కార్యవర్గ సభ్యులు ఎస్.మధురెడ్డి, బగాది రవి, సింహాద్రి, శ్రీను, జిల్లా సమితి సభ్యులుగా 10 మంది, జిల్లా కమిటీ సభ్యులుగా 19 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, అచ్యుత్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దుకై పోరాటం, గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు పోరాటం, మెడికల్ మాఫియా, విదేశీ ఉద్యోగాల పేరిట జరిగే ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, ఆన్‌లైన్ గేమ్ యాప్‌ల నియంత్రణకు సంఘం తరఫున పోరాటాలు చేసేందుకు తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

రెడ్డివారి గుండాలమ్మ తీర్థమహోత్సవం రేపు



గుండాలమ్మ దేవత

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన రెడ్డివారి గుండాలమ్మ తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 22న వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో భాగంగా అదే రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరపనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్ర పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు తీర్థ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర సాయంపై హర్షం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దేముడు

పెందుర్తి: విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడంపై 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం సుజాతనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 12 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.1.20 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నేడు

పెందుర్తి: స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి నిమిత్తం మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ తత్సమాన అర్హత కలిగి, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్కులు అర్హులన్నారు. వివరాలకు 77025 06614 ఫోన్ నెంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఘనంగా కూరత్తాళ్వార్ తిరునక్షత్రం పూజలు



హంసమూలన స్వామిని కొలువుంచి, పారాయణ చేస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం కూరత్తాళ్వార్ తిరునక్షత్రం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారులను తిరువీధిగా తీసుకెళ్లి ఆలయ బేడా మండపంలోని హంసమూల అధిష్ఠింపజేశారు. విశేష సేవాకాలం నిర్వహించారు. విశేష హారతి అందించారు. అంతకు ముందు అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా శాంతిపాఠం జరిపారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు, అధ్యాపకులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

'భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇప్పించండి'

మహారాణిపేట/పెందుర్తి: జాతీయ రహదారి విస్తరణలో భూమిని కోల్పోయిన తనకు నష్టపరిహారం ఇప్పించాలని పెందుర్తి మండలానికి చెందిన శరగడం అప్పారావు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో పెందుర్తి గ్రామానికి చెందిన శరగడం అప్పారావు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ పెందుర్తి మండలం పెందుర్తి గ్రామం సర్వే నెం.164, 164/2, 164/6, 164/4, 164/పిలో 34 సెంట్ల భూమి పోయిందని, ఇప్పటి వరకు ఆ భూమికి నష్టపరిహారం ఇవ్వలేదని మొరపెట్టుకున్నారు. పిల్లల చదువులు, పెళ్లి కోసం డబ్బులు అవసరం కాగా, దీనికి సంబంధించిన పరిహారం మొత్తం న్యాయస్థానంలో జమ చేశారని, దానిని తాము తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోయారు. నిర్వాసితులు అందరికి కలిపి మొత్తంగా పరిహారం జమ చేయడం వల్ల ఒక్కరుగా తీసుకోలేని పరిస్థితి ఉందని, ఇందులో ఎవరికి ఎంత పరిహారం వస్తుందో తెలియట్లేదన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని భూమి కోల్పోయిన బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అప్పారావు తన వినతి పత్రంలో కోరారు.



పరిహారం కోసం కలెక్టర్‌ను ఆశ్రయించిన అప్పారావు

పాడిరైతులకు అందుబాటులో ఉండాలి

- పశు వైద్య అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల సూచన



పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: పాడిరైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలని పశువైద్యులు, సిబ్బందికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. సోమవారం సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెందుర్తి మండలంలో జిల్లా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పశు వైద్య శిబిరాల గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. నెలాఖరు వరకు కొనసాగనున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు ప్రయోజనమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పాడి రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు వినియోగించుకుని పాడిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలపట్నం ప్రాంత సహాయ సంచాలకుడు డాక్టర్ రవి కుమార్, పెందుర్తి మండల పశువైద్యాధికారి డాక్టర్ జగన్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పరస




పూజలందుకున్న మరిడిమాంబ, క్రికెట్ టోర్నీ విజేతలకు ప్రైజ్ మనీ అందిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి: పెందుర్తి గ్రామ దేవత మరిడిమాంబ పరస సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెట గుళ్లు, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంగుల రాట్నాలు, వివిధ రకాల ఆట వస్తువులతో పిల్లలు సందడి చేశారు. పరస సందర్భంగా నిర్వహించిన పెందుర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన వెంకట వారియర్స్ జట్టుకు రూ.33,333, రన్నర్స్ లీ స్ట్రైకర్స్ జట్టుకు రూ.22,222 నగదు పురస్కారం, ట్రోఫీలను అందించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అసంపూర్తి సీసీ కాలువతో ఇబ్బందులు



దేశపాత్రునిపాలెంలో సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టాల్సిన మురుగు కాలువ

పరవాడ: దేశపాత్రునిపాలెం మెయిన్‌రోడ్డులో అసంపూర్తిగా నిలిచిపోయిన సీసీ కాలువలో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేశపాత్రునిపాలెం నుంచి మెయిన్ రోడ్డును ఆనుకుని జాజులవానిపాలెం ప్రధాన కాలువ వరకు సీసీ కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీన్ని వార్డు సచివాలయం–1 వరకు నిర్మించి వదిలేశారు. దీంతో గ్రామం నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు సచివాలయం వరకు వచ్చి అక్కడి నుంచి మట్టి కాలువ ద్వారా ప్రవహిస్తుంది. మట్టి కాలువలో పూడికలు పెరిగి, ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరిగి, రోగాల బారిన పడుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా నిలిచిన సీసీ కాలువ నిర్మాణం పూర్తి చేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పన్న సన్నిధిలో లలితాపీఠం ఉత్తరాధికారి



దత్తేశ్వరానంద భారతీస్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని విశాఖలోని లలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సోమవారం దర్శించుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

టెన్నికాయిట్‌లో సబ్బవరం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కుమార్‌ను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 41వ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో టెన్త్ చదువుతున్న జి.అసలేష్ కుమార్, బి గ్రీష్మ, బి.సుమంత్ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. అసలేష్ కుమార్ రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొంది, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జ్ హెచ్ఎం పి.రాధాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయ సిబ్బంది, పీఎంసీ చైర్మన్ జి.శంకరరావు, వైస్ చైర్మన్ జి.జ్యోతిశ్రీ తదితరులు అభినందించారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోండి



పెదముషిడివాడ పశు ఆరోగ్య శిబిరంలో పశుసంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణకీర్తి



తవ్వవానిపాలెం శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ స్వామినాయుడు, ఏడీ ఉషాకుమారి

పరవాడ: నెలాఖరు వరకు కొనసాగనున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య ఆరోగ్య శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణకీర్తి సూచించారు. సోమవారం నుంచి ప్రారంభమైన పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా పెదముషిడివాడలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలకు వ్యాపించే వ్యాధుల పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పశువులకు నట్టల నివారణ మందులు తాగించడం, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులకు వైద్య నిపుణులతో వైద్యం చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ నెలాఖరు వరకు నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాల్లో పశువులకు సోకే వ్యాధులకు వైద్యం పొందడానికి రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పశు ఆరోగ్య శిబిరానికి వచ్చిన 390 పశువులకు పశువైద్యులు చికిత్సలు జరిపి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో పరవాడ, వాడచీపురుపల్లి పశు వైద్యులు డాక్టర్ అశ్విని ప్రపుల్లా, డాక్టర్ సురేష్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ జగన్, పశు సంవర్ధక శాఖ సహాయకులు బాలాజీ, భాస్కర్, కృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం నిర్వహించిన పశువైద్య శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పాడిపశువులకు వైద్య సేవలు అందించినట్లు అంతకాపల్లి పశువైద్యులు డాక్టర్ జి.అరుణ తెలిపారు. ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ డాక్టర్ కె.ఉషాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ బోకం స్వామినాయుడు ప్రారంభించారు. 20 పాడి పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 11 చూడి ఆవులకు తనిఖీలు నిర్వహించారు. 36 లేగదూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందించినట్లు అరుణ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 31 వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరంలో పశు వైద్యులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ బి.సంధ్య, శివ, అమృతపురం పశుసంవర్ధక శాఖ సహాయ కులు కె.వెంకటరావు, అప్పలరాజు, కిశోర్, వైస్ సర్పంచ్ బోకం శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ మేళాకు స్పందన



దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్లు

పెందుర్తి: మెప్మా, హోమ్ ట్రయాంగిల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వేపగుంటలో సోమవారం నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్ల మేళాకు స్పందన వచ్చింది. పలు అంశాలపై జోనల్ కమిషనర్ కె.హేమావతి సూచనలు, సలహాలు అందించారు. మొత్తం 92 దరఖాస్తులు వచ్చాయి. కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, శానాపతి వసంత పాల్గొన్నారు.

జూదమాడుతున్న ఆరుగురి అరెస్ట్

పెందుర్తి: నరవ శివారులో గుట్టుచప్పుడు కాకుండా నాణేలతో జూదమాడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి నుంచి రూ.62 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

భూ వివాదంలో నలుగురిపై కేసు

పరవాడ: తాడి గ్రామ రెవెన్యూ పరిధిలో తన భూమిని ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని విశాఖకు చెందిన ఓ వ్యక్తి పరవాడ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. నగరానికి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు చెందిన ఎస్.రోహిత్ కుమార్‌వర్మకు తాడి రెవెన్యూ పరిధి సర్వే నెం.3/2ఎ సాలాపువానిపాలెం సమీపంలో 3.72 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి తమదంటూ సోమవారం కొంత మంది తన భూమిలో అక్రమంగా చొరబడి, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, ఆక్రమించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదానికి సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.